క్లుప్తంగా

బాణసంచా దుకాణాలకు స్థల పరిశీలన



రౌతులపూడిలో షాపుల స్థలాలను పరిశీలిస్తున్న తహసీల్దారు భీమారావు

రౌతులపూడి: దీపావళి సందర్భంగా మండల కేంద్రమైన రౌతులపూడిలో బాణసంచా అమ్మకాలకు సంబంధించి షాపుల స్థలాలను తహసీల్దారు బి.భీమరావు, డిప్యూటీ తహసీల్దారు పీవీవీ సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. బాణసంచా అమ్మకాల కోసం మండల వ్యాప్తంగా ఆరు దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. ఈ మేరకు రౌతులపూడి సినిమా సెంటర్‌లోని కనకదుర్గ గుడి సమీపంలో స్థలం అనువైందని గుర్తించారు. వారి వెంట రెవెన్యూ సిబ్బంది, షాపు నిర్వాహకులు ఉన్నారు.

రైల్వే స్టేషన్‌లో పోలీసుల తనిఖీ



తుని రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

తుని: దీపావళి పండగను పురస్కరించుకొని ప్రయాణికులు బాణసంచా తరలిస్తే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తుని పట్టణ సీఐ గీతారామకృష్ణ హెచ్చరించారు. మంగళవారం రైల్వేస్టేషన్‌లో డాగ్ స్క్వాడ్ తీసుకుని పార్శిల్, ప్రయాణికుల లగేజ్‌ను తనిఖీ చేశారు. ప్రయాణికులకు గంజాయి, మాదక ద్రవ్యాలు, బాణసంచాపై అవగాహన కల్పించారు. సోమవారం తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన సంఘటన దృష్టిలో పెట్టుకొని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామని సీఐ తెలిపారు. అనుమతి లేని వస్తువులను రైళ్లలో తీసుకువెళ్లడం చట్ట రీత్యా నేరమన్నారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. పలువురు పోలీసులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు భూమిపూజ

తొండంగి: మండలంలోని కృష్ణాపురం, వాకదారిపేట గ్రామాల్లో బుధవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా రోడ్లు నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు తెలిపారు. ఉదయం 10 గంటలకు మంత్రి రాజా కార్యక్రమంలో పాల్గొంటారని, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరుకావాలన్నారు.

'లిబరేషన్' శాంతి ప్రదర్శన

జగ్గంపేట: గోవిందపురం గ్రామంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో పాలస్తీనాకు సంఘీభావంగా శాంతి ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, జిల్లా కమిటీ సభ్యులు జక్కంపూడి రాజు నాయకత్వంలో ప్రదర్శన జరిగింది. పాలస్తీనలో భాగమైన గాజా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న జాతి నిర్మూలన దాడులను వారు ఖండించారు. ఐక్యరాజ్య సమితి కాల్పుల విరమణ తీర్మానం ఓటింగ్‌లో ప్రధాని మోదీ గైర్హాజరు కావడాన్ని తీవ్రంగా విమర్శించారు.

ప్రత్తిపాడు: పాలస్తీనాకు సంఘీభావంగా లంపకలోవ గ్రామంలో మంగళవారం సాయంత్రం సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో లిబరేషన్ నాయకులు రాజాల రత్నం, వీరాదే వతయ్య, బోడపాటి ఏసుబాబు, సుంకర రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

తుని: క్యాన్సర్‌పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని నూకరత్నం అన్నారు. మంగళవారం జాతీయ క్యాన్సర్ అవగాహన రోజు సందర్భంగా బాలికోన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. బాలికోనత పాఠశాల నుంచి రామకృష్ణాకాలనీ వృద్ధాశ్రమం వరకూ ర్యాలీ చేశారు. ఆశ్రమంలోని వృద్ధులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ అధికారులు చంద్రశేఖర్, విజయ్‌కార్తీ, శివలక్ష్మి, శ్రీదేవి, బషీర్, కిశోర్, శ్రీప్రకాష్, బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి తడిసిన వరి పంట

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలోని మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి మెట్ట ప్రాంతంలో కోత కోసిన వరి పనలు తడిశాయి. బెండపూడి, కొమ్మనాపల్లి, సీతారాంపురం, గోపాలపట్నం ప్రాంతాల్లో వ్యవసాయబోర్లు పరిధిలో వేసిన ఖరీఫ్ వరి పంట పక్వానికి రావడంతో రైతులు కోత కోశారు. పనలపై ఉండగా మంగళవారం రాత్రి కుండపోత వర్షానికి పనలపై ఉన్న వరిపంట తడవడంతో బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు. తడిసిన వరిపనలను నీటిలో ఉంచకుండా బయటకు తీసి ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని మండల వ్యవసాయశాఖాధికారి నరసింహం తెలిపారు. కాగా వాతావరణం ప్రతికూలంగా ఉండి అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో పంపా, పీబీసీ ఆయకట్టు ప్రాంతాల రైతుల్లో ఆందోళన నెలకొంది.

రైతుల చూపు.. ప్రకృతి వైపు..

- ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్న రైతులు
- తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకర దిగుబడి
- మండలంలో 850 ఎకరాల్లో సాగు



ఉప్పంపాలెంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన బహురూపి, కాలాపట్టి దేశీయ వరిపైరు



ఎస్.పైడిపాలలో ఆవుపేడతో మందును తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రౌతులపూడి: ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఆరోగ్యానికి హాని కలించే రసాయనిక ఎరువులు పురుగు మందులను వినియోగించకుండా సహజసిద్ధంగా తయారు చేసే వాటిని పంటలకు వినియోగిస్తున్నారు. దీంతో ఆరోగ్యకర పంటలను పొందుతున్నారు. తర్వారా అధిక ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. మండలంలో పలు గ్రామాల్లో సుమారు 800 మంది రైతులు 850 ఎకరాల్లో ప్రకృతి సాగు చేస్తున్నారు. వరి, రాగులు, కొర్రలు, గంటిలు వంటి ఆహారదినుసులతోపాటు మినుములు, పెసలు, కందులు, బొబ్బర్లు వంటి పప్పుధాన్యాలను పండిస్తున్నారు. అంతేకాకుండా వంగ, మిరప, టమాట, ఆనభ, గుమ్మడి, బెండ, చిక్కుడు, గోరు చిక్కుడు, గులిరాగి బీర వంటి కూరగాయలు, తోటకూర, మెంతికూర, కొత్తిమీర, గోంగూర, బచ్చలికూర, పాలకూర వంటి ఆకుకూరలు కూడా సాగు చేస్తున్నారు. అలాగే పసుపు, అల్లం, ముల్లంగి, మిరియాలు, ధనియాలు వంటి సుగంధ ద్రవ్యాలతోపాటు అరటి, బొప్పాయి వంటి పండ్ల తోటలు, కొబ్బరి, పామాయిల్ వంటి సుమారు 24 పంటలకు పైగా ఈ ప్రకృతి వ్యవసాయంలో రైతులు సాగు చేస్తున్నారు. తక్కువ ఖర్చు, అధిక ఆదాయంతోబాటు, మంచి ఆరోగ్యాన్ని అందిస్తుండడంతో ఈ సాగుపై ఎక్కువ మక్కువ చూపుతున్నారు.

స్వయంగా ఎరువుల తయారీ

రసాయనిక ఎరువులకు స్వస్తి పలికి సహజ సిద్ధమైన ఎరువులను రైతులే స్వయంగా తయారు చేసుకుంటున్నారు. దీనివల్ల పెట్టుబడి వేటు వారిపై పడకుండా ఉంటుంది. సహజ సిద్ధమైన ఘనజీవామృతం, బీజామృతం, ద్రవ జీవామృతం, అజొల్లా, జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు, పక్షి స్థావరాలు ఏర్పాటు, పోషక లోపాల నివారణకు పేడ, మూత్రం, ఇంగువ ద్రావణం, నీమాస్త్రం వంటివి సాగులో వినియోగిస్తున్నారు. దీంతో పెట్టుబడి తగ్గ, అధిక దిగుబడి, ఆదాయం, ఆరోగ్యకర పంటలను పొందుతున్నామని రైతులు వివరిస్తున్నారు. వరిలో సాధారణ పంటకు రూ.20వేల పెట్టుబడి పెడితే ధాన్యం దిగుబడి 25 నుంచి 30 బస్తాల వరకూ వస్తుంది. అదే ప్రకృతి సాగులో పెట్టుబడి రూ.10వేలు వరకూ ఖర్చు అవగా ధాన్యం దిగుబడి 25 నుంచి 30 బస్తాలు వస్తుంది. అయితే అధిక ధరకు విక్రయించి అధిక ఆదాయం పొందవచ్చని రైతులు చెబుతున్నారు.

లాభదాయకం



ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. ముందుకంటే ఇప్పుడు పంట లాభదాయకంగానే ఉంది. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా కేవలం ఆవుపేడ, ఆవు మూత్రంతో కూడిన సహజ సిద్ధంగా వచ్చే జీవామృతం, ఘనజీవామృతం వంటి వాటిని ఉపయోగించి ఈ ఏడాది బహుముఖి, కాలాఎట్టి దేశీయ వరి సాగు చేపట్టాను. ఆరోగ్యవంతమైన పంటలను పండించడం వల్ల సంతృప్తిగా ఉంది.

– సలాది గిరిబాబు, రైతు, ఉప్పంపాలెం

క్షేత్ర పర్యటనతో అవగాహన



గ్రామాల్లో ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి పకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నాం. రైతులంతా ఆ దిశగా సాగు చేస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ నాణ్యత కలిగిన పంటలను సాగు చేస్తున్నారు. సమాజానికి ఆరోగ్యకర పంటలను అందించేందుకు ప్రయత్నిస్తున్నాం. రైతులందరూ ప్రకృతి వ్యవసాయ సాగు చేపట్టాలి

– డి.వరలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ కో ఆర్డినేటర్ రౌతులపూడి

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే రీ సర్వే

- ఆర్డీఓ సీతారామారావు



ఇందుగపల్లిలో రీ సర్వే సిబ్బందితో చర్చిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

కోటనందూరు: 'వైఎస్సార్ శాశ్వత భూ హక్కు–భూ రక్ష' రీ– సర్వేలో విధిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని టీజే నగరం, అర్లమూరు, కేఓ అగ్రహారం, కేఏ మల్లవరం గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. రీ సర్వే జరుగుతున్న తీరుపై ఇటు సిబ్బంది, అటు రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ సీతారామారావు మాట్లాడుతూ ప్రతి రైతు సాగు చేస్తున్న భూమిపై సంపూర్ణ హక్కు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సర్వే అనంతరం భూ తగాదాలకు చోటుండదన్నారు. రైతులంతా సర్వే సిబ్బందికి సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఆయా గ్రామ సచివాలయాల్లో సర్వేకు సంబంధించి జరుగుతున్న డేటా ఎంట్రీని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కే కుశరాజు, ఆర్ఐ డీ శివకుమార్, మండల సర్వేయరు దాలిరాజు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న జర్నలిస్టులు

తుని: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి విలేకరులు క్షీరాభిషేకం చేశారు. మంగళవారం తుని పట్టణం గణపతినగర్ పార్కు ఆవరణలో నియోజకర్గానికి చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు జర్నలిస్టులు సంబరాలు జరుపుకొన్నారు. ఎన్నో ఏళ్లుగా జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అక్రిడేషన్ కలిగిన అందరికీ 3 సెంట్లు స్థలం ఇచ్చేందుకు కేబినెట్‌లో తీర్మానం చేయడం హర్షనీయమని పలువురు సీనియర్ పాత్రికేయులు అన్నారు. అంతకు ముందు జర్నలిస్టులు జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటంతో ర్యాలీ నిర్వహించి క్షీరాభిషేకం చేశారు. తుని, తొండంగి, కోటనందూరు, తుని పట్టణాలనికి చెందిన సీనియర్ పాత్రికేయులు కంతం అప్పారావు, డీఎస్ఎస్ ప్రభాకర్, సూర్య, నానాజీ, దేవవరపు అర్జున్, శ్రీధర్, వెంకట్, సూర్యప్రకాష్, వాసా ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రిమ్‌జిమ్ వేడుకలు



ఏకపాత్రాభినయం పోటీలో అలరించిన విద్యార్థులు

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో రిమ్‌జిమ్ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. మంగళవారం తుని, పాయకరావుపేటకు శ్రీప్రకాష్ విద్యార్థులు రిమ్‌జిమ్ వేడుకల్లో పాల్గొన్నారని ప్రిన్సిపాల్ మూర్తి తెలిపారు. లలిత కళల విభాగంలో మట్టితో బొమ్మలు తయారీ, పోస్టర్ మేకింగ్, థియేటర్ ఆర్ట్స్ విభాగంలో యోగా, ఏకపాత్రాభినయం, బృందగానం, కథలు, చిత్రాన్ని చూసి వివరించడం, స్పెల్‌బీ, మ్యాప్ పాయింటింగ్, క్విజ్, రన్నింగ్, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు గోకవరంలో 'జగనన్నకు చెబుదాం'

గోకవరం: స్థానిక గోపీకృష్ణ ఫంక్షన్ హాలులో బుధవారం తూర్పుగోదావరి కలెక్టర్ కె.మాధవీలత ఆధ్వర్యంలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎంపీడీఓ కె.పద్మాజ్యోతి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగే ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, ఇతర మండల ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముఖ్యమంత్రి జగన్ రైతు పక్షపాతి

జగ్గంపేట: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి మించి పెట్టుబడి సాయం అందిస్తూ రైతు పక్షపాతిగా నిలిచారు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ సేవదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. జగ్గంపేటలో మంగళవారం రైతు భరోసా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలో 40 వేల మంది రైతులకు సుమారు రూ.17 కోట్లు రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం క్రింద రైతుల ఖాతాలకు జమ అయిందన్నారు. రైతుల తరపున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. జగన్ పాతయాత్రలో రైతులకు ఏడాదికి రూ.12500 చొప్పున నాలుగేళ్లలో రూ.50 వేల పెట్టుబడి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇచ్చిన హామీ కన్నా ఎక్కువగా రూ.13,500 చొప్పున ఐదేళ్లలో రూ.67500 అందించనున్నారని తెలిపారు. ఇప్పటికే ప్రతి రైతు కుటుంబానికి రూ.65,500 వారి బ్యాంక్ ఖాతాలకు జమఅయిందన్నారు. పేదలు, రైతుల కోసం పనిచేస్తున్న జగన్‌ను 2024లో జరిగే ఎన్నికల్లో మళ్లీ గెలుపించుకుందామని ఆయన కోరారు.

వేళంగిలో 104 సేవలు

శంఖవరం: వేళంగి గ్రామంలో మంగళవారం 104 వాహనం సేవలందించారు. గ్రామస్తులకు బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. గర్భిణులకు పరిక్షలు నిర్వహించి తగు జాగ్రత్తలు సూచించారు. వైద్యురాలు సౌమ్యశ్రీ మాట్లాడుతూ గ్రామాల్లో 104 వాహనం ద్వారా పర్యటించి రోగులకు వైద్యం అందిస్తున్నామన్నారు. అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు ఉన్నారు.

తక్కువ వడ్డీకే ఎల్ఐసీ గృహ రుణాలు

తుని: సొంత ఇంటిని నిర్మించుకునే యాజమానులకు జీవిత బీమా సంస్థ తక్కువ వడ్డీకే రుణాలను ఇస్తోందని ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ రీజనల్ మేనేజరు డి.జయ ప్రకాష్‌బాబు అన్నారు. మంగళవారం తుని జీఎస్‌టీ రోడ్డులోని వాణి అపార్ట్‌మెంట్స్‌లో ఏర్పాటు చేసిన ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కార్యాలయాన్ని తుని శాఖ మేనేజరు జి.సత్యనారాయణతో కలిసి జయ ప్రకాష్‌బాబు ప్రారంభించారు. ప్రజలకు సులభంగా గృహ రుణాలను అందిస్తామన్నారు. ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ రీజనల్ మార్కెటింగ్ మేనేజరు వైవీవీఎస్ రామకృష్ణ, వైకేకే శాస్త్రి, విజయశ్రీ, నరేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

బ్రాందీ షాపులో అక్రమ అమ్మకాలు

రౌతులపూడి: స్థానిక బ్రాందీషాపులో మద్యం బాటిళ్లను అక్రమంగా విక్రయిస్తున్నారు. స్థానిక గిడజాం సెంటర్‌లో ఉన్న ప్రభుత్వ బ్రాందీషాపు సేల్స్‌మెన్ మణికంఠ బెల్ట్‌షాపు నిర్వాహకుడికి మద్యాన్ని విక్రయిస్తుండగా పలువురు వినియోగదారులు ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్దేశించిన మద్యం ధరలు కంటే ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 వరకూ బెల్ట్ షాపులకు విక్రయించి అదనపు వసూళ్లు చేసి,సొమ్ములు కాజేస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీని వల్ల నాణ్యమైన మద్యం బెల్ట్‌షాపులకు విక్రయించి, నాణ్యత లేని బ్రాండులు తమకు అంటగడుతున్నారని వినియోగదారులు మండిపడుతున్నారు. ఇదేమి అని అడిగితే అవే ఉన్నాయి కావలిస్తే తీసుకోండి లేకుంటే పొండి అని సమాధానం చెబుతున్నారని ఆగ్రహించారు. అక్రమ అమ్మకాలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎక్సైజ్, పోలీసు అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని వారు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలి



ప్రత్తిపాడు సమావేశంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: వివిధ రాజకీయ పార్టీల నాయకులు బూత్‌లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బూత్ లెవెల్ ఏజెంట్ల ద్వారా కొత్తగా ఓటు నమోదు చేసుకునేవారిని గుర్తించి అధికారులకు తెలియజేయాలన్నారు. డిసెంబర్ 9వ తేదీ వరకు కొత్త ఓట్ల నమోదు ప్రక్రియ జరుగుతుందని, ప్రతి గ్రామంలో నూరు శాతం ఓటర్ల నమోదుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. తహసీల్దార్లు పీవీవీ గోపాలకృష్ణ, భీమారావు, ప్రసాద్, మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, పీసీసీ సభ్యుడు ధర్నాలకోట శ్రీను, లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలనపై సమావేశం

జగ్గంపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఓటరు జాబితా పరిశీలనపై జగ్గంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్ఓ జి.సూర్యనారాయణ రెడ్డి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మరణాలు, డబుల్ ఎంట్రీ, డూప్లికేట్ ఓట్లు లేకుండా పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఆదేశించారు. ఓటర్లు లిస్టు వెరిఫికేషన్‌లో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పవర్ గ్రిడ్ ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ లతాకుమారి

గండేపల్లి: పవర్ గ్రిడ్ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి పేర్కొన్నారు. సూరంపాలెం పవర్ గ్రిడ్‌కార్పొరేషన్‌లో అవినీతిపై అవగాహన వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని పవర్ గ్రిడ్ సిబ్బంది మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విధి నిర్వహణలో అవినీతికి తావు లేకుండా పనిచేయాలని, ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరమని తెలియజేశారు. పిల్లలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పవర్ గ్రిడ్ ఆవరణలో మొక్కలు నాటారు. విజిలెన్స్ వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్, స్లోగన్ పోటీల్లో విజేతలకు పవర్ గ్రిడ్ డీజీఎం సత్య వర్ధన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సిబ్బంది ఏహెచ్‌వి కుమార్, జె కోటేశ్వరరావు, ఏఎస్ఎన్ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల సాగులో సస్య రక్షణ చర్యలు

రౌతులపూడి: గ్రామాల్లో కూరగాయల సాగు చేస్తున్న రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవన శాఖ అధికారి అరుణ్‌కుమార్ అన్నారు. బంగారయ్యపేటలో రైతులు సాగు చేస్తున్న పలు కూరగాయల సాగును మంగళవారం ఆయన పరిశీలించారు. సాగులో ఎప్పటికప్పుడు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ప్రస్తుతం టామాటపై ఆశించే ఎండుతెగులు నివారణకు సుడోమోనస్ ఒక కేజీ పౌడర్‌ను 25 కేజీల పశువుల ఎరువులో కలిపి మట్టిలో వేయాలన్నారు. రెండు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటర్ నీటిలో కలిపి మొక్క మొదట్లో వేయలన్నారు. అలాగే కాయతొలుచు పురుగు నివారణకు ఫిరామోన్ ట్రాప్స్ ఎకరానికి 5 చొప్పున అమర్చుకోవాలన్నారు. పోషక లోపాన్ని, ఆకు ముడత నివారణకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవనశాఖ సిబ్బంది శ్రీలేఖ, రైతులు పాల్గొన్నారు.

భ్రూణ హత్యలు నేరం

ప్రత్తిపాడు: భ్రూణ హత్య, లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని స్థానిక కోర్టు ప్యానల్ అడ్వకేట్ బుగతా శివ తెలిపారు. శిశు సంరక్షణ దినోత్సవం సందర్భంగా ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయ అవగాహన సదస్సు నిర్వహించింది. బాలల హక్కులు చట్టాల గురించి బుగత శివ వివరించారు. గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో మండల న్యాయసేవాధికారి సంస్థ ప్యానల్ అడ్వకేట్ అవసరాల దేవి, పంచాయతీ కార్యదర్శి ద్విబాష్యం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



ఎంపీడీఓ కార్యాలయంలో వైద్యులను సన్మానిస్తున్న ఎంపీపీ, నాయకులు

కిర్లంపూడి: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ తోట రవి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆసుపత్రుల పనితీరు, లోటుపాట్లపై సమీక్షించారు. ప్రజలకు అవసరమైన మందులు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయా లేవా, వసతులు ఎలా ఉన్నాయి అనే వాటికి ఆరా తీశారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేలా కృషి చేయాలని వైద్యులకు సూచించారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్షలో ప్రజలకు వైద్య సేవలు అందించి విజయవంతం చేసిన వైద్యులు బి.రాంబాబు నాయక్, వి.అరుణ, జ్యోతిమణిమాలను స్థానిక నాయకులతో కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, ఎంపీడీఓ బడే రాజేశ్వరావు, పెనగంటి రాజేష్, సంఘన వెంకటేశ్వరావు, బిళ్లకుర్తి శివాజీ, వైద్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు



ఏలేశ్వరంలో కిట్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యవతి, వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: పట్టణంలోని 2, 12 వార్డుల పరిధిలో వైద్యుడు పాపారావు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరంలో రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందుల కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఇంటికి, ప్రతి కుటుంబానికి ప్రభుత్వం వైద్య సేవలు అందిస్తోందన్నారు. ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, సామంతుల సూర్యకుమార్, దోశే కిషోర్, కోరాడప్రసాద్, పైల విజయ్‌కుమార్, రాంబాబు, సత్యనారాయణ, నాగేశ్వరరావు, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

ప్రత్తిపాడు: లంపకలోవ గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ ప్రారంభించారు. సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందుల కిట్లను అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు గొంతిన సురేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, జేసీఎస్ కన్వీనర్ రామిశెట్టి చిన్నబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు దొరబాబు, మహాలక్ష్మీరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడి మృతి

తొండంగి: గోపాలపట్నం రైల్వేస్టేషన్ రోడ్డులో వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు తొండంగి ఎస్సై వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఈ నెల 2న సాయంత్రం గోపాలపట్నం రైల్వేస్టేషన్ రోడ్డులో త్రిమూర్తులు ఆలయం సమీపంలో అన్నవరం నుంచి ఒంటిమామిడి వైపు వెళ్తున్న బొలేరో వాహనం వేగాంగా వెళ్తూ వృద్ధుడిని ఢీకొట్టింది. స్థానికులు గాయపడిన వృద్ధుడిని 108లో తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి కాకినాడ ఆస్పత్రికి తరలించగా ఈ నెల 5న వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై గ్రామ వీఆర్వో ఎం.సింహాచలం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ వృద్ధుడి వయస్సు 60ఏళ్లు ఉంటాయని, ఎత్తు 5.6 అడుగులు ఉన్నారని, పూర్తి వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నామన్నారు.. వివరాలు తెలిస్తే 9440904847 కు తెలిపాలని కోరారు.

విపత్తుల సమయంలో జాగ్రత్తలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శివకుమార్

తొండంగి: సమాజంలో విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన తక్షణ జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన అవసరమని కాకినాడ రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ కె.శివకుమార్ అన్నారు. పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు రోజుల పాటు విపత్తుల నిర్వహణపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విపత్తుల సమయంలో సమయస్ఫూర్తితో విద్యార్థులు వ్యవహరించి ప్రజలకు సేవచేయాలన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు మోహన్‌రావు, సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ మెహర్ తదితరులు పాల్గొన్నారు.

కోటి బిల్వార్చన ప్రాంగణం శుభ్రం



కోటి బిల్వార్చన ప్రాంగణంలో వ్యర్థాలను తొలగిస్తున్న భక్తులు, సేవకులు

తుని రూరల్: వి.కొత్తూరు శివారు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఈ నెల నాలుగో తేదీన కోటి బిల్వార్చన, పడిపూజ నిర్వహించిన ప్రాంగణంలో వినియోగించిన పూజా ద్రవ్యాలు, పేరుకున్న ఇతరేతర వ్యర్థాలు తొలగింపు పెనుభారంగా మారింది. కోటి బిల్వార్చనకు తుని, పాయకరావుపేట అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో రెండు నెలల పాటు ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లలో వేలాది మంది భక్తులతో పాటు సేవకులు హాజరై వివిధ సేవలు చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 40 వేల మంది భక్తులు పాల్గొనగా నాలుగో తేదీన కోటి బిల్వార్చన, పూడిపూజ, దీపారాధన వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా టన్నులు కొద్దీ వినియోగించిన పూజా ద్రవ్యాలు, ఇతర వ్యర్థాలు ప్రాంగణంలో పేరుకుపోయాయి. మూడు రోజులవుతుండడంతో వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని నిర్వాహకులు చేపట్టారు. భక్తులు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునివ్వడంతో వచ్చి సేవలందించారు. ప్రాంగణానికి తరలివచ్చి తొలగింపులో సేవలు అందించాలని పిలుపునిచ్చారు. దీంతో కొద్దిమంది భక్తులు తరలివచ్చి మంగళవారం వ్యర్థాలు తొలగింపు చేపట్టారు. బుధవారం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.